# మరోసారి కేసీఆరే ముఖ్యమంత్రి

## 100కు పైగా సీట్లు బీఆర్ఎస్‌కు ఖాయం

- నిర్మల్ నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి
- నామినేషన్ దాఖలు చేసిన ఐకేఆర్
- గులాబీమయమైన నిర్మల్.. వెల్లువెత్తిన జనాభిమానం



నామినేషన్ పత్రాలు చూపుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి




కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా వెళ్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ అర్బన్, నవంబర్ 9 : రాష్ట్రానికి మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. నిర్మల్ నియోజికవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా గురువారం తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. అంతకుముందు తన నివాసంలో ప్రత్యేక పూజలు చేసి కుటుంబ సభ్యులు, ముఖ్యనాయకులు, తన అనుచరగణంతో కలిసి ప్రచార రథంలో ఆర్డీవో కార్యాలయానికి బయల్దేరారు. ఈ సందర్భంగా మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ కోసం తన ప్రాణాలనే ఫణంగా పెట్టి, సాధించారని పేర్కొన్నారు. సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో 100 సీట్లకుపైగా బీఆర్ఎస్ గెల్చుకోవడం ఖాయమని స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలు నమ్మశక్యం కాని హామీలతో మరోసారి ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తన హయాంలోనే నిర్మల్ జిల్లాను తీసుకొచ్చామని, విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలను తీసుకొచ్చామని, ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని తీసుకొచ్చామని, 27వ ప్యాకేజీ ద్వారా నీటిని వదులుకున్నామని తెలిపారు. అభివృద్ధి చేసిన పార్టీలకే రాష్ట్ర, నియోజకవర్గ ప్రజలు పట్టం కడుతున్నారని ఏ పార్టీ ప్రజలకు న్యాయం చేస్తుంది, ఏ నాయకుడు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తాడో గమనించాలని సూచించారు. ఈనెల 30న జరిగే పోలింగ్‌లో నియోజకవర్గ ప్రజలందరూ కారు గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో తనను గెలిపిస్తే, సీఎంగా కేసీఆర్‌ను మరో సారి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

### గులాబీమయమైన నిర్మల్..

నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఇంద్రకరణ్ రెడ్డి నామినేషన్ వేస్తున్న విషయాన్ని తెలుసుకున్న నియోజకవర్గ ప్రజలు స్వచ్ఛందంగా గ్రామాలు, మండలాలు, పట్టణ కేంద్రాలు, వార్డుల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం అల్లోల ఇంటికి చేరుకున్న కార్యకర్తలు, ప్రజలు, కుటుంబ సభ్యులు, తన అనుచరగణంతో కలిసి తన ప్రచార వాహనంలో ఇంటి నుంచి బయల్దేరారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ప్రజలు, పార్టీ నాయకులు, అడుగడుగునా బ్రహ్మరథం పలికి ఘన స్వాగతం తెలిపారు. దాదాపు 20 వేల మంది స్వచ్ఛందంగా తరలిరావడంతో నిర్మల్ పట్టణం గులాబీమయమైంది. జై తెలంగాణ.. జై ఇంద్రన్న అంటూ నినాదాలతో ర్యాలీ మార్మోగింది. కార్యకర్తలు డ్యాన్స్‌లు చేస్తూ సందడి చేశారు. నామినేషన్ అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి పట్టణంలో ర్యాలీ తీశారు. కార్యక్రమంలో నిర్మల్ జడ్పీ చైర్‌పర్సన్ విజయ లక్ష్మి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వీ సత్యనారాయణ గౌడ్, పార్టీ పట్టణాధ్యక్షుడు మారుగొండ రాము, నాయకులు ఉన్నారు.

# బీఆర్ఎస్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థికి సంపూర్ణ మద్దతు

## అనిల్ గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తామని ఓయూ జేఏసీ వెల్లడి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 9 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్‌కు ఓయూజేఏసీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఆయన గెలుపు కోసం బోథ్ నియోజకవర్గంలో గడప గడపకూ వెళ్లి ప్రచారం నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఓయూజేఏసీ అధ్యక్షుడు డాక్టర్ ఎల్చాల దత్తాత్రేయ మాట్లాడారు. బోథ్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా ఉన్న ఎంపీ సోయం బాపురావ్ గిరిజన, ఆదివాసీ మహిళల అక్రమ రవాణా కేసులో నిందితుడని ఆరోపించారు. అమాయకులైన మహిళలను అక్రమంగా రవాణా చేస్తూ గుజరాత్‌లో దొరికిపోయిన దొంగగా సోయంను అభివర్ణించారు. ఎంపీ నిధులతోనే కొడుకు పెళ్లి, ఇంటి నిర్మాణం చేసుకున్నానంటూ ఆయన చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఎంపీ నిధులను సొంత అవసరాలకు వినియోగించుకున్న చరిత్ర, ప్రజలను మోసం చేసిన చరిత్ర ఉన్న వ్యక్తి కావాలో.. ప్రజల కోసం నిరంతరం పనిచేసే వ్యక్తి కావాలో.. బోథ్ నియోజకవర్గ ప్రజలు ఆలోచించుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ ఒక్కడే శ్రీరామరక్ష అని అభిప్రాయపడ్డారు. ఆదిలాబాద్ జిల్లాలో అనిల్ జాదవ్, జోగు రామన్నను గెలిపించి, కేసీఆర్‌కు కానుకగా అందజేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఓయూజేఏసీ నాయకులు పాండు జాదవ్, మల్లెల స్వామి, అలాలి వెంకటేశ్, బానోతు రవీందర్, వంశీకృష్ణ, సత్యపాల్ పాల్గొన్నారు.



కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్తున్న జాన్సన్ నాయక్

# దేవుళ్లకు మొక్కి నామినేషన్ సెంటర్‌కు..

## ఉట్నూర్ ఆర్డీవోకు మూడు సెట్లు అందజేసిన జాన్సన్ నాయక్

ఉట్నూర్, నవంబర్ 9: ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థి జాన్సన్ నాయక్ గురువారం మండల కేంద్రంలోని సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్నారు. మొదటగా ఖానాపూర్ పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం, గండి పోచమ్మకు మొక్కుకొని ఉట్నూర్ పట్టణంలోని వినాయక్ చౌక్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి బంజారాల ఆరాధ్య దైవం దుర్గాదేవి, అక్కడి నుండి దర్గా, చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఉట్నూర్ ఆర్డీవో జీవాకర్‌రెడ్డికి మూడు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, సీనియర్ నాయకుడు రవీందర్‌రావు, ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, మండలాధ్యక్షుడు కందుకూరి రమేశ్, వైస్ ఎంపీపీ బాలాజీ, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

### ప్రజా సేవకే అంకితమవుతా..

ఖానాపూర్, నవంబర్ 9 : ప్రజలు తనను ఆశీర్వదిస్తే జీవితాంతం ప్రజాసేవకే అంకితమవుతానని ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. గురువారం నామినేషన్ వేస్తున్న సందర్భంగా పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న జాన్సన్ నాయక్

# ప్రజా ఆశీర్వాదంతో మళ్లీ గెలుస్తా..

## బీఆర్ఎస్ ముథోల్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డి

- శ్రేణులతో కలిసి నామినేషన్ దాఖలు
- బాసర అమ్మవారికి ప్రత్యేక పూజలు



నామినేషన్ పత్రాలు చూపిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి విఠల్‌రెడ్డి

ముథోల్, నవంబర్ 9 : ప్రజాశీర్వాదంతో మరోసారి భారీ మెజార్టీతో గెలుస్తానని బీఆర్ఎస్ ముథోల్ నియోజవకర్గ అభ్యర్థి విఠల్‌రెడ్డి అన్నారు. ముథోల్‌లో బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలు తమకు బలమని పేర్కొన్నారు. మండలంలోని తరోడా గ్రామంలో దర్గా వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మూడు సెట్ల నామినేషన్లను ఆయన దాఖలు చేశారు. నాయకులు లోలం శ్యాంసుందర్, మురళీగౌడ్, జేకే పటేల్, ముథోల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, సంజీవ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పోతన్న యాదవ్, ఎజాజోద్దీన్, సుధాకర్ రెడ్డి, దిగంబర్ మాశెట్టివార్, తదితరులున్నారు.

### బాసరలో ప్రత్యేక పూజలు

బాసర, నవంబర్ 9 : బాసర సరస్వతీ అమ్మవారిని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ అభ్యర్థి విఠల్‌రెడ్డి గురువారం దర్శించుకున్నారు. నామినేషన్ పత్రాలను అమ్మవారి చెంత ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణాలో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. సీఎంగా కేసీఆర్, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని అమ్మవారిని మొక్కినట్లు తెలిపారు. అమ్మవారి ఆశీర్వాదంతో మరోసారి గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. అమ్మవారికి హారతి పూజా కార్యక్రమాలు నిర్వహించి, అర్చకుల ఆశీర్వచనాలు తీసుకున్నారు.



బాసర అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి విఠల్‌రెడ్డి